RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260


ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 30 పేజీలు - 04 వెల - 04/- గురువారం 31 అక్టోబర్ 2024

●దీపావళి కానుకగా అమల్లోకి సూపర్ సిక్స్ ఉచిత సిలిండర్ల పథకం
●మొదటి విడతకు అయ్యే ఖర్చు రూ.894 కోట్ల మొత్తాన్ని పెట్రోలియం సంస్థలకు అందజేసిన సీఎం చంద్రబాబు
●1వ తేదీన శ్రీకాకుళంలో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం

# దీపావళి కానుకగా 'దీపం-2'

## రూ.2,684 కోట్లు మంజూరు చేసిన ఏపీ ప్రభుత్వం



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30: సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. దీపం-2 పథకానికి రాష్ట్రం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్-6 హామీల్లో భాగంగా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గ్యాస్ సరఫరా చేసే పెట్రోలియం సంస్థలకు అందజేశారు. బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాక్ లో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందజేశారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అయ్యే రూ. 2,684 కోట్ల ఖర్చుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ప్రభుత్వం పెట్రోలియం సంస్థలకు చెక్కు అందజేసింది. రూ.2,684 కోట్ల మంజూరుకు అంగీకారం తెలుపుతూ, మొదటి విడతకు ఖర్చు అయ్యే రూ.894 కోట్లు పెట్రోలియం సంస్థలకు అందించింది. దీపం-2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు అందించనుంది. ఏడాదికి మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు సొమ్మును విడుదల చేయనుంది. 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్నిలబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారులు సిలిండర్ కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానుంది. కేంద్రం ఇచ్చే రూ. 25ల రాయితీ పోను మిగిలిన రూ.876లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం అమలుకు ప్రతియేటా రూ. 2,684 కోట్లు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడనుంది. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు తెనాలి నుంచి వచ్చిన దీపం పథకం లబ్ధిదారు బాలమ్మ, ఏలూరు నుంచి వచ్చిన లబ్ధిదారు భవానీ, విజయవాడ నుంచి వచ్చిన లబ్ధిదారు మంగతాయారు, సివిల్ సప్లై శాఖ అధికారులు, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్‌లో డేటా విప్లవం ద్వారా

# ఏపీకి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

: మంత్రి నారా లోకేశ్



ఐటీ సర్వ్ ఎలయెన్స్ సినర్జీ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

ఏఐ సమర్థ వినియోగంతో పరిపాలనలో దీర్ఘకాల సమస్యలకు చెక్ పెట్టొచ్చన్న మంత్రి

రాజకీయాల్లో ఎత్తుపల్లాలు చూశానని వ్యాఖ్య

తన స్థానాన్ని ప్రజలే నిర్ణయిస్తారన్న లోకేశ్

ఆర్థికంగా స్థిరపడ్డాకే పారిశ్రామికవేత్తలు రాజకీయాల్లోకి రావాలని సూచన

లాస్ వేగాస్ లోని ఐటీ సర్వ్ అలయెన్స్ సినర్జీ సదస్సుకు విశిష్ట అతిథిగా హాజరైన లోకేశ్... ఫైర్ సైడ్ చాట్ లో పారిశ్రామికవేత్త రవి తొట్టెంపూడి అడిగిన ప్రశ్నలకు వివరణాత్మకంగా సమాధానాలిచ్చారు. 23 దేశాల నుంచి 2,300 మంది పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

2

# చంద్రబాబు, కరువు కవల పిల్లలు

నైరుతి పవనాలు అనుకూలించినా రాయలసీమలో కరువు ఛాయలు

ఐదు జిల్లాలు, 54 మండలాల్లో కోరలు చాస్తున్న కరువు

చంద్రబాబుపై ఎంపీ విజయసాయిరెడ్డి ఎద్దేవా



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30: చంద్రబాబు, కరువు కవల పిల్లలు అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చంద్రబాబును ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిన నేపథ్యంలో చంద్రబాబుపై తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబు వస్తే కరువు వస్తుందని అన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలు అనేది నానుడి అని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది నైరుతి అనుకూలించినా రాయలసీమలో కరువు నీడలు వెంటాడుతున్నాయని విజయసాయిరెడ్డితెలిపారు. ఐదు జిల్లాలలో 54 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి ఉందని అన్నారు. వైసీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని పక్కన పెట్టి రైతుల ఉసురు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఏపీ ప్రభుత్వం కరువు మండలాల జాబితాను మంగళవారం ప్రకటించింది.

మిగతాది 2లో...



# అసలు బాధితుడు జగనే

## విజయమ్మ బహిరంగ లేఖపై వైసీపీ అసహనం

ఆనాడు జగన్‌ను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్‌ను సపోర్టు చేయడం తప్పుకాదా అని నిలదీత..?

చంద్రబాబు మేలు జరుగుతుందని తెలిసినా అప్పుడు ఎందుకు మౌనం..

2లో



# కరువు మండలాలివే..

జాబితాను ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశం

2లో

# సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ భేటీ



2లో

# టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు...



●పాలకమండలిలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు
●24 మంది సభ్యులతో పాలకమండలి
●ఏపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు చోటు
●తెలంగాణ నుంచి నన్నూరి నర్సిరెడ్డికి చోటు




అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. టీటీడీ ఛైర్మన్, సభ్యులను ఈరోజు సాయంత్రం టీటీడీ ప్రకటించింది. 24 మంది సభ్యులతో పాలకమండలిని ప్రకటించింది. టీటీడీలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కింది. ఏపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు చోటు దక్కింది.

టీటీడీ బోర్డు సభ్యులు... జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి (కోవూరు ఎమ్మెల్యే), ఎంఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే), పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి), జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ), శ్రీ సదాశివరావు నన్నపనేని, కృష్ణమూర్తి (తమిళనాడు), కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్ ఆర్ఎన్ (కర్ణాటక), జస్టిస్ హెచ్ఎల్ దత్ (కర్ణాటక), శాంతారామ్, పి.రామ్మూర్తి (తమిళనాడు), జానకీ దేవి తమ్మిశెట్టి, బూంగునూరు మహేందర్ రెడ్డి (తెలంగాణ), అనుగోలు రంగశ్రీ (తెలంగాణ), బూరగాపు ఆనందసాయి (తెలంగాణ), సుచిత్ర ఎల్ల (తెలంగాణ), నరేశ్ కుమార్ (కర్ణాటక), డా.ఆదిత్ దేశాయ్ (గుజరాత్), శ్రీసౌరభ్ హెచ్ బోరా (మహారాష్ట్ర).

# బెయిల్ రద్దుపై కుట్ర

## శతాబ్దపు జోక్ : వైఎస్ షర్మిల



2లో

# అసలు బాధితుడు జగనే

## విజయమ్మ బహిరంగ లేఖపై వైసీపీ అసహనం

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30:
ఇటీవల వైఎస్ఆర్ ఆస్తుల విషయంలో మాజీ సీఎం జగన్ ఆమె సోదరి షర్మిల ఆస్తుల విషయంలో కొన్ని రోజులుగా వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ఆర్ భార్య విజయమ్మ దీనిపై స్పందించి బహిరంగ లేఖ రాయడం తెలిసిందే. అయితే ఆమె స్పందనపై వైసీపీ మాత్రం పెదవి విరుస్తుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉండగా ఆస్తులు పంచలేదని.. ఇప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులే అని వైఎస్ విజయమ్మ చెప్పడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్) ద్వారా సుదీర్ఘ లేఖను విడుదల చేసింది. దివంగత మహానేత వైఎస్ఆర్ భార్యగా, వైసీపీ అధ్యక్షురాలు వైఎస్ జగన్ తల్లిగా విజయమ్మను అమితంగా గౌరవిస్తామని ఆ లేఖలో తెలిపింది. బహిరంగ లేఖ నేపథ్యంలో కొన్ని అంశాలను ఆమె ముందుకు, ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని పేర్కొంది. విజయమ్మ రాసిన లేఖలో జగన్‌ను లీగల్‌గా ఇబ్బంది పెట్టేందుకు, తద్వారా బెయిల్ రద్దుకు జరిగిన కుట్ర వ్యవహారాన్ని కనీసం ప్రస్తావించకపోవడం ప్రజలను పక్కదోవపట్టించడమే అని వైసీపీ తెలిపింది. సరస్వతీ కంపెనీ విషయంలో ఈడీ అటాచ్‌మెంట్ ఉన్నప్పటికీ, తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ, యాజమాన్య బదిలీ జరిగేలా క్రయవిక్రయాలు చేయకూడదని, అందుకే అటాచ్‌మెంట్‌లో ఉందనే విషయం అందరికీ తెలిసినప్పటికీ, సరస్వతీ విషయంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయవద్దని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలు సహా న్యాయ సలహాలు ఉన్నప్పటికీ, తప్పు అని తెలిసినప్పటికీ మోసపూరితంగా, కుట్రపూరితంగా షేర్లు బదిలీ చేసిన మాట వాస్తవమే కదా? అని ప్రశ్నించింది. షర్మిల భావోద్వేగాలకు, ఒత్తిళ్లకు గురై జగన్‌కు న్యాయపరంగా, చట్టపరంగా చిక్కులు తెచ్చే ఈ పనికి, తెలిసి కూడా విజయమ్మ ఆమోదించి సంతకం పెట్టడం నిజమే కదా అని నిలదీసింది. విజయమ్మ లేఖలో ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలను, వైసీపీ అభిమానులను పక్కదోవపట్టించడమే కదా అని చెప్పింది.

2024 ఎన్నికల్లో జగన్ ఒక్కరే ఒకవైపున ఉంటే, అటువైపు చంద్రబాబు నేతృత్వంలో రాజకీయ ప్రత్యర్థులు జట్టుకడితే, మరికొన్ని గంటల్లో ఎన్నికల ప్రచారం ముగుస్తుందనగా, దివంగత మహానేత వైఎస్ఆర్‌ను ఎఫ్ఐఆర్ లో పెట్టిన, తన కుమారుడ్ని అన్యాయంగా 16నెలలు జైల్లోపెట్టిన కాంగ్రెస్‌కు ఓటు వేయండంటూ, వైసీపీని ఇబ్బందిపడుతూ వీడియో విడుదలచేసి విజయమ్మ షర్మిలగారివైపు ఉన్నారనే విషయాన్ని చాలా స్పష్టంగాచెప్పారు. దివంగత మహానేత, వైఎస్సార్ రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్ కుటుంబంపై నిరంతరం కుట్రలు పన్నే చంద్రబాబుకు రాజకీయంగా మేలుచేసే ఇలా వ్యవహరించడం ధర్మమేనా? రాజకీయాలు పక్కనపెడితే ఒక తల్లిగా ఆరోజు విజయమ్మగారు మద్దతు సంగతి దేవుడెరుగు, కనీసం తటస్థవైఖరిని మరిచిపోయి, పక్షపాతం వహించిన వైనంచూసి వైఎస్సార్ అభిమానులు తీవ్రంగా కలతచెందారు, బాధపడ్డారు. ఇప్పుడు షర్మిలగారి భావోద్వేగాలు, ఒత్తిళ్ల ప్రభావంతో, సరస్వతీ కంపెనీ వ్యవహారంలో న్యాయపరంగా ఇబ్బందులు వచ్చి, స్వయంగా ఆమె కుమారుడి బెయిల్ రద్దు కుట్రకు దారితీస్తుందని తెలిసి కూడా మోసపూరితంగా, షేర్ల సర్టిఫికెట్లు పోయాయని చెప్పి, ఒరిజనల్ షేర్ సర్టిఫికెట్ లేకుండా, జగన్ గారి సంతకాలు లేకుండా, ఎవ్వరికీ తెలియకుండా షేర్లను బదిలీచేసి, షర్మిలతోనే విజయమ్మ ఉన్నారని మరోసారి స్పష్టంగా చెప్పారు.

# భారత్‌లో డేటా విప్లవం ద్వారా
# ఏపీకి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

### ఐటీ సర్వ్ ఎలయెన్స్ సినర్జీ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్



ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30:
మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... 1992లో విడుదల చేసిన ఒక జీఓ కారణంగా ఇంటర్మీడియట్ లో దివ్యాంగులు కేవలం 5 సబ్జెక్టుల్లో మాత్రమే పరీక్షలు రాసే విధానం వల్ల ఇటీవల రాష్ట్రానికి చెందిన విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. నీట్ లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులు ఈ విషయాన్ని తన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. వెంటనే అధికార యంత్రాంగాన్ని కదిలించి ఫ్రెష్ గా జీఓ విడుదల చేయడంతో వారికి ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ లాంటి ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు లభించాయన్నారు.
అధికారులు చొరవ చూపకపోతే వారి పరిస్థితి ఏమయ్యేది? గవర్నెన్స్ లో ఇటువంటి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఏఐని వినియోగించాలని భావిస్తున్నట్లు చెప్పారు. గవర్నెన్స్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

**అభివృద్ధిలో ఇతర దేశాలతో పోటీపడతాం..**
రానున్న రోజుల్లో భారత్ లో డేటా విప్లవం రాబోతోంది. డేటా సేవల రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు దేశంలోకి రాబోతున్నాయి. అందులో వంద బిలియన్ డాలర్లను ఏపీకి రప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలతో కాకుండా ఇతర దేశాలతో పోటీపడతామన్నారు లోకేశ్. సవాళ్లను అవకాశాలుగా తీసుకుని పనిచేయడం తమకు అలవాటైందని పేర్కొన్నారు. ఇటీవల కృష్ణానదికి గత 248 సంవత్సరాల్లో ఎన్నడూ లేనివిధంగా వరదలు వచ్చాయని గుర్తు చేశారు.
ఆ సమయంలో వ్యవసాయానికి వాడే డ్రోన్లను వరదబాధితులకు సాయం అందించేందుకు ఉపయోగించామని తెలిపారు. తమ ప్రయత్నం విజయవంతం కావడంతో డ్రోన్ల ద్వారా వివిధ రంగాల్లో సేవలు అందించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన డ్రోన్ సమ్మిట్ లో 5 గిన్నిస్ రికార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక డ్రోన్ పాలసీ తెచ్చినట్లు చెప్పారు. ఏఐ వినియోగంతో పాలనా పరమైన సమస్యలను అధిగమించడానికి త్వరలో రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇది అంతర్జాతీయస్థాయి నిపుణులను తయారు చేస్తుందని తెలిపారు.

**గత అయిదేళ్లు ఏపీకి చీకటి యుగం..**
గత అయిదేళ్లు ఏపీకి చీకటి యుగం అని మంత్రి లోకేశ్ అన్నారు. చంద్రబాబునాయుడు తన రాజకీయ జీవితంలో ఎన్నో క్లిష్ట పరిస్థితులను చవి చూశారని తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితం గురించి చెప్పాలంటే ఒక చాప్టర్ సరిపోదన్నారు. గత అయిదేళ్లలో ఇదివరకెన్నడూ లేనివిధంగా ఆయన చీకటి జీవితాన్ని అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. చేయని తప్పుకు రాజమండ్రి సెంట్రల్ జైలులో 53 రోజులు జైలుశిక్ష అనుభవించారని వాపోయారు. ఇకపై కొత్త చంద్రబాబు నాయుడును ప్రజలు చూడబోతున్నారని తెలిపారు.
2014-19 మధ్య ఆయన అభివృద్ధి చేసిన రాజమండ్రి సెంట్రల్ జైలులోనే బాబు గారిని నిర్బంధించడం కలిచివేసిందన్నారు. ఆనాటి పరిస్థితులు ప్రత్యక్షంగా చూసిన తన భార్య బ్రాహ్మణి ఇటువంటి రాజకీయాలు మనకు అవసరమా అని ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో హైదరాబాద్ లో నిర్వహించిన గ్రాటిట్యూడ్ కార్యక్రమానికి 45వేల మందికి పైగా హాజరుకావడంతో ఆమె తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. బ్రాహ్మణి సహకారం వల్లే తాను రాజకీయాల్లో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 226 రోజుల యువగళం పాదయాత్రలో ఆమె పూర్తి సహాయ, సహకారాలు అందించారని తెలిపారు. తాను తన కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకునే సరికి ప్రతిరోజూ రాత్రి 11 గంటలు అవుతుందన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయక తప్పదని పేర్కొన్నారు. రాజకీయాల్లో తాత ఎన్టీఆర్ లెగసీని కొనసాగించడం తనకు గర్వంగా ఉందన్నారు.

**రాజకీయాల్లో ఎత్తుపల్లాలను చూశాను..**
రాజకీయాల్లో ఎత్తుపల్లాలను చూశానని లోకేశ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో భవిష్యత్తు కోసం ఎవరైనా సేఫ్ సీటు ఎంచుకుంటారు. కానీ, తాను మాత్రం 1985 తర్వాత ఎన్నడూ గెలవని మంగళగిరి నియోజకవర్గాన్నిఎంచుకున్నట్లు తెలిపారు. 2014లో పోటీచేసి 5,300 ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అయినప్పటికీ నిత్యం ప్రజల్లోనే ఉంటూ సేవలందించానని తెలిపారు. ఫలితంగా ఇటీవల ఎన్నికల్లో తనను అక్కడి ప్రజలు 91వేల పైచిలుకు మెజారిటీతో గెలిపించారని హర్షం వ్యక్తం చేశారు.
గెలుపుఓటములతో సంబంధం లేకుండా నిత్యం జనంలో ఉండే నేతలనే ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. జాతీయస్థాయి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తారా అన్న ప్రశ్నకు లోకేశ్ సమాధానమిస్తూ... తన రాజకీయ భవిష్యత్తును ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. శాఖలు నిర్ణయించే సమయంలో లక్షలాది మంది భావిభారత పౌరుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విద్యాశాఖను ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. సవాల్ గా తీసుకుని విద్యా వ్యవస్థలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టానన్నారు. ప్రస్తుత రాజకీయాలు సంక్లిష్టంగా మారాయని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాతే రాజకీయాల్లోకి రావాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ విశ్వవిద్యాలయం లాంటిదని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కీలక స్థానాల్లో ఉన్న నేతల మూలాలు టీడీపీతోనే ముడిపడి ఉన్నాయన్నారు.

**అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి పనిచేస్తాం..**
అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి పని చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఐటీ హబ్ గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. త్వరలో అక్కడ టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. పారిశ్రామీకరణ నేపథ్యంలో వ్యవసాయరంగం దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ పెట్టుబడులు, ఉత్పాదకతకు మధ్య పొంతన లేకపోవడంతో గిట్టుబాటు సమస్య ఏర్పడుతోందని తెలిపారు. రాయలసీమలో బంగారం పండే భూములున్నాయని పేర్కొన్నారు.

## జాగ్రత్తలు చెబుతూ... దీపావళి శుభాకాంక్షలు చెప్పిన పవన్ కల్యాణ్

**క్రాకర్స్ జాగ్రత్తగా పేల్చాలని సూచన**
**దీపావళి అంటే దీపకాంతితో పాటు బాణసంచా ఉంటుందన్న డిప్యూటీ సీఎం**
**అజాగ్రత్తగా... నిర్లక్ష్యంగా ఉంటే కాళరాత్రిగా మారుతుందని హెచ్చరిక**



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30:
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సకలజనులకు దీపావళి శుభాకాంక్షలు చెప్పారు. క్రాకర్స్ జాగ్రత్తగా పేల్చాలని కూడా సూచనలు చేశారు. ప్రజలకు పలు సూచనలు చేస్తూ ఆయన శుభాకాంక్షలు చెప్పారు. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి దీపావళి... దీపాన్ని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వుకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి ప్రతీకగా భావిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి దీపావళి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. దీపావళి అంటే దీపాల శోభతో పాటు బాణసంచా ఉంటుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అయితే జాగ్రత్తలు పాటిస్తే దీపావళి నిజంగా నయనానందకరంగా... మనస్సులో గుర్తుండి పోతుందన్నారు. కొద్దిగా అజాగ్రత్తతోనో ,... నిర్లక్ష్యంగానో టపాకాయలు పేలిస్తే అది కాళరాత్రిగా మారుతుందని హెచ్చరించారు. ప్రతి సంవత్సరం దీపావళి పండుగ తర్వాత పలువురు బాణసంచా గాయాలతో ఆసుపత్రిపాలు కావడం మనం చూస్తూనే ఉంటామని, కాబట్టి పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనాదిగా జరుపుకుంటున్న ఈ దీపావళి అందరికీ శుభాలను కలిగించి... ఆనందం... ఆరోగ్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు.

# చంద్రబాబు, కరువు కవల పిల్లలు

(మొదటి పేజీ తరువాయి)
ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

# కరువు మండలాలివే..

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30:
ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలోని నార్పల.. అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాలోని తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల.. అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, సంబెపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డి పల్లె, రామాపురం, వీరబల్లె, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలపడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురుబలకోట, పెద్దతిప్ప సముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె.. చిత్తూరు జిల్లాలోని పెనుమూరు, యాదమర్రి, గుడిపాల మండలాలను తీవ్ర కరువు మండలాలుగా నోటిఫై చేశారు. కర్నూలు జిల్లాలోని కౌతాలం, పెద్దకడుబూరు.. అనంతపురం జిల్లాలోని విడపనకల్, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు.. శ్రీసత్యసాయి జిల్లాలోని కనగానిపల్లి, ధర్మవరం, నంబుల పులకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి.. చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వెంకటగిరికోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాలను కరువు మండలాలుగా గుర్తించారు.

## బెయిల్ రద్దుపై కుట్ర శతాబ్దపు జోక్ : వైఎస్ షర్మిల

అమరావతి, అక్టోబర్ 30 (ఆర్ఎన్ఎ) : ఏపీ మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దుకు కుట్ర జరుగుతుందని పేర్కొనడం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని వైఎస్ షర్మిల అన్నారు. కుటుంబంలో ఆస్తుల పంపకంలో జరుగుతున్న వివాదంపై మరోసారి ఆమె స్పందించారు. వందశాతం వాటాలు బదలాయిస్తామని ఎంవోయూ పై వైఎస్ జగన్ సంతకం చేశారు. బెయిల్ రద్దవుతుందని సంతకం చేసినప్పుడు తెలియదా? అంటూ ఎద్దేవా చేశారు. 2021లో క్లాసిక్ రియాలిటీ, సండూర్, సరస్వతి షేర్లను ఎలా అమ్మారు? విజయమ్మకు రూ. 42 కోట్లకు షేర్లు ఎలా అమ్మారు? షేర్లు అమ్మడం స్టేటస్ కోను ఉల్లంఘించినట్లు కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. షేర్ల బదిలీకి, బెయిల్ రద్దుకు సంబంధం లేదని మీకు తెలుసు కాబట్టే షేర్లను విక్రయించి, సంతకాలు చేశారని ఆరోపించారు. షేర్లు విక్రయించి ఇప్పుడేమో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ బెయిల్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదని విజయమ్మకు తెలుసని అన్నారు. ఈడీ అటాచ్ చేసింది షేర్లు కాదని, రూ. 32 కోట్లు విలువైన కంపెనీ స్థిరాస్తి అని పేర్కొన్నారు. షేర్ల బదలాంపుపై ఎలాంటి ఆంక్షలు, అభ్యంతరాలు తనకు లేవని వెల్లడించారు. స్టేటస్‌కో ఉన్నది షేర్లపై కాదని తెలిపారు. గతంలోనూ ఎన్నో కంపెనీల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అటాచ్ చేసిన వాటి షేర్లు, స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్, బదిలీలు మాత్రం ఆపలేదని అన్నారు. ఈడీ అటాచ్ చేసినందువల్ల షేర్ల బదిలీ చేయకూడదనడం హాస్యాస్పదమని షర్మిల తెలిపారు.

## సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ భేటీ

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30:
అమరావతి : నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం ఏపీ సీఎం చంద్రబాబుతో బుధవారం భేటీ అయ్యారు. ఏపీ సచివాలయంలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. విజన్ డాక్యుమెంట్-2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా నవ్యాంధ్రను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా, ఏడాదికి 15 శాత వృద్ధిరేటు సాధన ధ్యేయంగా ప్రణాళికను రూపొందించామని సీఈవోకు వివరించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా , నియోజకవర్గం వారిగా లక్ష్యాలను తయారు చేసుకున్నామని వెల్లడించారు. వ్యవసాయం, ఆక్వా కల్చర్ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను రూపొందించామని నీతి ఆయోగ్‌కు వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఈజీ ఆఫ్ లీవింగ్, మౌలిక సదుపాయాలు, జనాభా నిర్వాహణ, డేటా సెంటర్లు, ఏఐతో వృద్ధిరేటును పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సలహాదారు, డైరెక్టర్లు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్రా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన యోగా గురువు బాబా రామ్‌దేవ్

### ఏపీలో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుపై చర్చ

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, విద్యా రంగాల్లో పెట్టుబడులపై చర్చించినట్లు సీఎం వెల్లడి**



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 30:
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ కలిశారు. అమరావతిలో ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఏపీలో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, విద్యా రంగాల్లో పెట్టుబడులపై వారి మధ్య చర్చ జరిగింది.
బాబా రామ్‌దేవ్‌తో భేటీకి సంబంధించి చంద్రబాబు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుతో పాటు వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, విద్యా రంగాల్లో పెట్టుబడులపై చర్చించినట్లు పేర్కొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 31 అక్టోబర్ 2024

## అవుకు సర్వసభ సమావేశంలో పాల్గొన్న మంత్రి బీసీ.






ఆంధ్ర ప్రగతి బనగానపల్లె, అక్టోబర్ 30: ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి, ప్రభుత్వ అందిస్తోన్న సేవలు ప్రజలకు త్వరితగతిన చేరవేయడంతో పాటు, వారి నుంచి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు.. బుధవారం బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హజరయ్యి, స్థానిక చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి అతి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఏదైనా అభివృద్ధి కార్యక్రమాలు అర్థాంతరంగా నిలిచిపోతే, వాటిని తక్షణమే పూర్తి చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం మాదిరిగా కక్షపూరిత పాలన ఈ ప్రభుత్వంలో ఉండదని, అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని మండలంలోని ప్రజాప్రతినిధులకు మంత్రి సూచించారు. అదే సమయంలో అవుకు గ్రామంలోని ప్రజలు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి కొన్ని సమస్యలు తీసుకురాగా, వాటిపై స్పందించిన మంత్రి అక్కడిక్కడే ఎమ్మార్వో, ఎంపీడీవోలతో మాట్లాడి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అవుకు గ్రామ ప్రజలు సైతం హాజరవడం జరిగింది. ఈ కార్యక్రమానికి అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ఎమ్మార్వో, ఎంపీడీవోలతో పాటు ఆరోగ్య, వ్యవసాయ, నీటిపారుదల, ఆర్ % డ% బీ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ రాజ్ శాఖ, ఉపాధి హామీ తదితరుల శాఖల అధికారులు హాజరయ్యారు.

## అవుకు ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి





ఆంధ్ర ప్రగతి అవుకు అక్టోబర్ 30: ప్రభుత్వాస్పత్రికి వైద్యసాయం కోసం వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వైద్యులకు సూచించారు. బుధవారం బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని మంత్రి సందర్శించారు. అనంతరం అక్కడ రోగుల వార్డులను పరిశీలించిన మంత్రి, వారికి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు గురించి ఆరా తీశారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మరింత నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు గురించి వైద్యులతో చర్చించారు. ప్రభుత్వాస్పత్రిలో కొన్ని వైద్య పరికరాలు అందుబాటులో లేవని, వీటిని సమకూర్చడానికి దాదాపు రూ. 20 లక్షలు ఖర్చువుతోందని మంత్రి దృష్టికి వైద్యులు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి ఆస్పత్రిలో కావాల్సిన వైద్య పరికరాలు, కనీస అవసరాలపై ఒక అంచనా వేసి తన దృష్టికి తీసుకొస్తే, ఆయా పరికరాలను సమకూర్చడంతో పాటు, సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.





ఆంధ్ర ప్రగతి అవుకు అక్టోబర్ 30: బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భూమి పూజ చేశారు. రూ. 60 లక్షల అంచనా వ్యయంతో అవుకు గ్రామంలోని ఎస్సీ కాలనీ సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ సీసీ రోడ్ల పనులను రెండు దశల్లో ప్రారంభించాలని స్థానిక అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమైన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, ఇంకా ఏదైనా అపరిష్కృత సమస్యలు ఉంటే, వాటిని తన దృష్టికి తీసుకొస్తే త్వరితగతిన పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

## నంద్యాల ఇంఫల్ డిపోలో నూతన హమాలీలను చేర్చుకోవాలి

### -సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ డిమాండ్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 30: నంద్యాల జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ నందు నూతనంగా హామాలిలను చేర్చుకోవాలని 36మందికి పర్మిషన్ 2017లో వచ్చిన ఇక్కడి అధికారులు వాటిని పూర్తి చేయకుండా వున్న వారితోనే గొడ్డు చాకిరి చేయిస్తున్నారని సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ ఆరోపించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అప్సబీసీల్ లో కొత్త వారిని తీసుకోవాలంటే లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని వారు ఆరోపించారు హమాలీలు తక్కువగా వున్నారని బుజంతో చేయవలసిన పనులను యంత్రాలా ద్వారా చేయిస్తూ రూల్స్ కు వ్యతిరేకంగా పనులు చేయిస్తున్నారని అసలు 2017లో 36 మందికి పర్మిషన్ వచ్చిన ఎందుకు తీసుకోలేదని వారు అధికారులను సూటిగా ప్రశ్నించారు కనీసం అక్కడ డియం ను నియమించక పోవడం అధికారుల నిర్లక్ష్యనికి నిద్రర్శనమన్నారు. ఇక్కడ కర్నూల్ జిల్లా కు చెందిన వారే హామాలిలుగా వున్నారే తప్ప నంద్యాల జిల్లా కు చెందిన వారిని ఎందుకు నియమించడం లేదని వారు అధికారులను ప్రశ్నించారు ప్రతి డిపోలో హమాలీలు మ్యాన్ పవర్ లో 24%తక్కువగా వున్న ఎందుకు నియమించడం లేదని వారు ప్రశ్నించారు ఇకనైనా అధికారులకు చిత్తశుద్ధి ఉంటే హమాలీలకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని కాళీలను పూర్తి చెయ్యాలని వారు కోరారు లేని యెడల అప్సబీసీల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# స్వీయ సత్ప్రవర్తన ద్వారానే అవినీతి నిర్మూలన

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 30: అవినీతిని అంతమొందించే ప్రక్రియ స్వీయ సత్ప్రవర్తన ద్వారానే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉద్ఘాటించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, విజిలెన్స్ ఇంచార్జ్ డిఎస్పి కృష్ణారెడ్డి, జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వారంలో భాగంగా ఈ సంవత్సరం అక్టోబర్ 28 నుండి నవంబర్ 3 తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది దేశం యొక్క శ్రేయస్సు కోసం సమగ్రత, సంస్కృతి అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని... ఈ మూడు పదాలలో ఎంతో అంతర్లీనత దాగి ఉందని పౌరులలో స్వీయ సత్ప్రవర్తన అలవర్చుకొని అవినీతి రహిత సమాజానికి తోడ్పాటు అందించాలన్నారు. మన సత్ప్రవర్తన ద్వారానే అవినీతి నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. అవినీతి వల్లే ప్రపంచంలో మన దేశాన్ని అత్యుత్తమ కేంద్రంగా ఎందుకు చూపించలేకపోయామో మనకు మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యం రకరకాలుగా గ్రౌండింగ్ చేయడం వల్ల ప్రభుత్వానికి కేజీకి 40/- రూపాయలు ఖర్చువుతుందని, ఈ బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకోకుండా తక్కువ రేటుకు విక్రయించడం లాంటి వ్యత్యాసాలకు స్వస్తి పలికి సరి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉదహరించారు. అలాగే నకిలీ విత్తనాలు, రసాయనిక ఎరువులతో రైతులు రైతులనే మోసం చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలతో సంబంధం లేకుండా అవినీతిని ప్రోత్సహిస్తూ పనులు చేయించుకునే పరిస్థితి నెల కొనిందన్నారు. ప్రతి సంస్థలో విజిలెన్స్ విభాగం ఉన్నప్పటికీ మన దృక్పథం మార్చుకోనంతవరకు అవినీతి కొనసాగుతూనే ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలన గురించి విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించుకోవడం దురదృష్టకరమన్నారు. అవినీతిపై భారత ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ తెలిసి తెలిసి తప్పులు చేయడం జరుగుతోందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, అగ్నిమాపక అధికారి , డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమణ, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొని అవినీతి నియంత్రణపై తమ అభిప్రాయాలను వెళ్ళబుచ్చారు. అంతకుముందు విజిలెన్స్ ఇన్చార్జి డిఎస్పి కృష్ణారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవినీతి నియంత్రణపై అధికారులలో అవగాహన కల్పించారు.

## పాత బ్రిడ్జి శిధిలావస్థ..

### కొత్త బ్రిడ్జి10సం" అయిన పూర్తికాలేదు



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30: నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలో కుందు మద్దిలేరు. వాగు పై 100 సంవత్సరముల బ్రిడ్జి శిధిలావస్థకు చేరిన పట్టించుకోని అధికారులు ప్రక్కన 10 సంవత్సరాల నాడు మొదలుపెట్టి ఇప్పటికీ పూర్తికాని బ్రిడ్జి. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు. అధికారులు. ఆ ప్రాంతాన్ని సిపిఐ పట్టణ సమితి బృందం పరిశీలించడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కుందు .మద్దిలేరు వాగుపై గత 100 సంవత్సరముల నాడు నిర్మించిన వంతెన నేడు శిధిలావస్థకు చేరి ఎప్పుడు పడిపోతుందో తెలియడం లేదు వంతెనపై ఒక అడుగు లోతు గుంతలు ఉన్నవి 40. 50 టన్నుల లారీలు టిప్పర్లు తిరుగుతూ ఉంటాయి. శనివారం వచ్చిందంటే రాణి మహారాణి దగ్గర జరిగే జీవాల సంత వల్ల ట్రాఫిక్ అంతరాయం కలిగి ఈద్గా దగ్గరకి ట్రాఫిక్ చేరుకోవడం జరుగుతుంది ఆ భారం కూడా వంతెన పై పడుతుంది అదేవిధంగా . ఎస్ఆర్బిసి . టిడ్కో గృహాలకు. నందమూరి నగర్. వైయస్సార్ నగర్. పులిమద్ది. రాయమాల్పూర్. మునగాల. పోలూరు. మీదుగా వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అది ప్రమాదంగా మారిందని ప్రక్కన కొత్త బ్రిడ్జి 10 సంవత్సరముల నాడు టిడిపి ప్రభుత్వంలో మొదలుపెట్టి 70 శాతం పూర్తి అయినది ఆ ప్రభుత్వము పోయి వైఎస్ఆర్పి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కూడా బ్రిడ్జి పూర్తి కాలేదు మరలా ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. రెండు నెలల క్రితం మినిస్టర్ ఫారుక్ గారు వచ్చి ఆ బ్రిడ్జిని పరిశీలించడం కూడా జరిగింది కానీ ఇంతవరకు పని మొదలు పెట్టలేదు ఇప్పటికైనా కొత్త వంతెనను పూర్తి చేయలేని ఎడల పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియదు ఏదైనా జరగడానికి జరిగితే అందుకు ప్రజాప్రతినిధులు అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి ఎస్ హుస్సేన్నా సభ్యులు కళ్యాణ్ జోసఫ్ చిన్న. వెంకటేశ్వర్లు రాజుమా భాష. తదితరులు పాల్గొన్నార.

## 12 మంది పేకాట రాయుళ్ళ అరెస్టు

### -వారి వద్ద నుండి 1,20,320 రూపాయలు, 11 సెల్ ఫోన్స్, 6 మోటార్ సైకిల్స్ స్వాధీనం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30: నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు మరియు అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు ఉత్తర్వుల మేరకు పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్ట ర్ కిరణ్ మరియు పాణ్యం ఎస్సై నరేంద్ర లు మరియు సిబ్బంది రాబడిన సమాచారం మేరకు తొగర్చేడు గ్రామ సరిహద్దు శివారులలోని పొలాల్లో పేకాట అడుతున్న సద్దాం, ఈరన్న, ఏసురాజు, బాల హుస్సేని మరియు ఎనిమిది మందిని పట్టుకొని వారి వద్ద నుండి రూ 1,20,320/- నగదును, 11 సెల్ ఫోన్ లు మరియు 6 మోటర్ బైకు లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి లను మరియు సిబ్బంది ఏఎస్ఐ రఫిక్, నరసింహులు, హెచ్ సి రామాంజినేయులు, మధు పిసి వెంకటేష్ , గిరి, రవి లను ఏస్పీ అధిరాజ్ సింగ్ రాణా మరియు అడిషనల్ ఎస్పి యుగంధర్ బాబు అభినందించారు.

### నంద్యాల 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన

## దొంగతనము కేసులో ముద్దాయి అరెస్టు

### -నంద్యాల వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ అక్టోబర్ 30: నంద్యాల జిల్లా, నంద్యాల 1 వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధి సంగపేటవీధి లో 14/15.09.2024 వ తేదిన ఫిర్యాదిదారు అయిన కట్ట ప్రమీల దేవి %ఔ%/0 నాగ లక్ష్మయ్య ఇంటిలో జరిగిన రాత్రి దొంగతనము కేసులో,బుధవారం మధ్యాహ్నం 12.00 గంటల సమయములో కేసులో ముద్దాయి అయిన నంద్యాల టౌన్ హరిజనపేటకు చెందిన అనుపూరి శివ దుర్గ ఏ బట్టి, వయస్సుబీ19 సం//లు, తండ్రి పేరు: నాగ పుల్లయ్య అను అతనిని నంద్యాల టౌన్ బీమవరము రోడ్డు లో ఉన్న ఈద్గా సమీపములో అరెస్టు చేసి అతని వద్ద నుండి సుమారు %=ం% 1,80,000/- ల విలువ చేసే సొత్తు అయిన 1)బంగారు నల్లపూసల దండ - 01 (సుమారు 29.70 (గ్రాముల బరువు కలది). 2) బంగారు గాజులు-02( సుమారు 22.00 (గ్రాములు బరువు కలవి) మరియు వెండితో తయారు చేసిన వస్తువులు అయిన 1) వెండి కుంకుమ బరిణేలు -6 (సుమారు 92 (గ్రాముల బరువు కలవి ), 2) వెండి చెంబు-01 (సుమారు 103.600 (గ్రాములు బరువు కలది), 3) వెండి గ్లాస్-01 (సుమారు 43 (గ్రాములు బరువు కలది), 4) వెండి దీపపు ప్రమిదలు-02 (సుమారు 21.50 (గ్రాములు బరువు కలవి), 5) వెండి గిన్నె-01( సుమారు 40.700 (గ్రాములు బరువు కలది), 6)వెండి ప్లేట్-01(సుమారు 51.00 (గ్రాములు బరువు కలది) వాటిని రికవరి చేయడమైనది. ఈ కేసును నంద్యాల అడిషనల్ ఎస్పీ ఏన్ . యుగంధర్ బాబు ఆధ్వర్యములో నంద్యాల ఒకటవటౌన్ ఇన్స్పెక్టర్ జి . సుధాకర్ రెడ్డి , సబ్ ఇన్స్పెక్టర్ ఆర్ . సురేష్ చేదించడం జరిగింది.దొంగతనం కేసును చాలెంజింగ్ గా తీసుకుని ముద్దాయిలను కనుగొని రిమాండ్ చేయుటలో ప్రత్యేక శ్రద్ధ కరపరిచిన ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ని, సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ ని వారి సిబ్బందిని నంద్యాల జిల్లా ఏస్పీ అదిరాజ్ సింగ్ రాణా ప్రత్యేకముగా అభినందించడమైనది.

# హజ్ యాత్ర అడ్వాన్స్ డిపాజిట్ గడువు పెంపు.!

### -నవంబర్ 11 కు చివరి గడువు పొడిగింపు.

### -రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి అమరావతి అక్టోబర్ 30: దేశవ్యాప్తంగా హజ్ -2025 యాత్ర అడ్వాన్స్ హజ్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి చివరి తేదీని కేంద్ర హజ్ కమిటీ పొడిగింపు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్-2024లో తాత్కాలికంగా ఎంపిక చేయబడిన యాత్రికుల అడ్వాన్స్ హజ్ మొత్తాన్ని రూ.1,30,300/- 21.10.2024 నాటి సర్క్యులర్ నెం.10 ప్రకారం 31.10.2024లోపు జమ చేయాల్సి ఉందన్నారు. అయితే అడ్వాన్స్ హజ్ మొత్తాన్ని డిపాజిట్ చేసే తేదీని మరింత పొడిగించమని దేశంలోని వివిధ రాష్ట్ర హజ్ కమిటీలు, వివిధ సంస్థలు మరియు వ్యక్తుల నుండి అభ్యర్థనలు కేంద్ర హజ్ కమిటీకి వెల్లాయని తెలిపారు. కేంద్ర హజ్ కమిటీకి వచ్చిన వివిధ అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకొని అడ్వాన్స్ హజ్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి చివరి తేదీగా నవంబర్ 11వ తేదీ ( 11.11.2024 23:59 గంటల) వరకు పొడిగించబడి నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. అడ్వాన్స్ హజ్ మొత్తాన్ని డిపాజిట్ చేసిన తర్వాత, తాత్కాలికంగా ఎంపిక చేయబడిన యాత్రికులు ఈ క్రింది పత్రాలను సంబంధిత రాష్ట్ర/UT హజ్ కమిటీలకు 14.11.2024న లేదా అంతకు ముందు సమర్పించాలని తెలిపారు.

1) హజ్ దరఖాస్తు ఫారం (HAF) 2) డిక్లరేషన్ & అండర్టేకింగ్

3) పే-ఇన్-స్లిప్/ఆన్లైన్ రసీదు కాపీ

4) మెడికల్ స్క్రీనింగ్ మరియు ఫిట్నెస్ సర్టిఫికేట్ (వెబ్సైట్లో అందుబాటులో ఉన్న ఫార్మాట్ ప్రకారం అంటే hajcommittee.gov.in)

5) ఇంటర్నేషనల్ మెషిన్-రీడబుల్ పాస్పోర్ట్ స్వయం ధ్రువీకృత కాపీలు

అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. యాత్రికులు అడ్వాన్స్ హజ్ మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి మరియు సంబంధిత రాష్ట్ర హజ్ కమిటీలో పత్రాలను సమర్పించడానికి నిర్దేశించిన చివరి తేదీకి ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని తెలిపారు.లేని పక్షంలో వారి హజ్ సీటు రద్దుచేయబడుతుందని, తదుపరి పొడిగింపులు మంజూరు చేయబడవని కేంద్ర హజ్ కమిటీ స్పష్టం చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక




# బదిలీపై వెళుతున్న డిఆర్ఓ, ఆర్డీఓలకు ఆత్మీయ వీడ్కోలు.!

## -అంకిత భావంతో విధులు నిర్వర్తించారు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 30:
బదిలీ పై వెళుతున్న డిఆర్ఓ ఎ. పద్మజ, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం దాస్ లు జిల్లాభివృద్ధిలో ఉత్తమ పనితీరు కనబరచి అంకిత భావంతో పనిచేశారని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అభినందించారు. బుధవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో కలెక్టరేట్, జిల్లా రెవెన్యూ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.
ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన డిఆర్ఓ, ఆర్డీఓలు అంకిత భావంతో నిర్ణీత కాలవ్యవధిలో చక్కగా పనిచేశారని అభినందించారు. సాధారణ ఎన్నికల్లో ఎలాంటి ఫిర్యాదులు లేకుండా భాద్యతతో పని చేశారన్నారు. ఎన్నికలతో పాటు రెవెన్యూ అంశాలను కోఆర్డినేట్ చేసుకొంటూ పరిపాలన వ్యవహారాలు డిఆర్ఓ చక్కదిద్దారన్నారు. డిఆర్ఓ పోస్టు కీలకమైనదని అన్ని శాఖలకు మధ్య వారధిగా వుంటూ సర్వీసులు అందించాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, జిల్లా అధికారుల సమన్వయంతో కలసి పనిచేశారన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించగలమన్నారు. తన




వంతు ప్రయత్నం చేస్తే జిల్లాను టాప్ 5 లో చూపించే అవకాశం వుంటుందన్నారు. బదిలీలు అయినా అధికారుల మధ్య సఖ్యత, సంబంధాలు కొనసాగాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ డిఆర్ఓ, ఆర్డీఓలు చిత్తశుద్ధితో కృషి చేసి విశిష్ట సేవలు అందించారన్నారు. బదిలీ పై వెళ్తున్న డిఆర్ఓ ఎ. పద్మజ మాట్లాడుతూ తన ఉద్యోగ ప్రయాణంలో తాను పలు శాఖల, చాలామంది అధికారులతో పని చేశానన్నారు. ప్రత్యేకంగా నంద్యాల జిల్లా కలెక్టర్ దగ్గర పని చేయడం అదృష్టంగా భావించారన్నారు. కలెక్టర్ ఎవరినీ కూడా నొప్పించకుండా అధికారులతో పనులు చేయిస్తారన్నారు. జిల్లాలో పనిచేసినన్ని రోజులు కలెక్టరేట్ లో ఉన్నటువంటి



సిబ్బంది అందించిన సంపూర్ణ సహకారం మరువలేనిదని అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బదిలీపై వెళ్తున్న డిఆర్ఓ, పదవీ విరమణ చేస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ ఎం. దాస్ లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో నూతన డిఆర్ఓ డి.రామునాయక్, నంద్యాల ఆర్డీఓ సి. విశ్వనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, డోన్ ఆర్డీఓ కె.పి.నరసింహులు, కెఆర్సిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరి, అన్ని శాఖల జిల్లాధికారులు, కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల పర్యవేక్షకులు, సిబ్బంది, రెవెన్యూ అసోషియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు.

## -జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు.



ఆంధ్రప్రగతి నంద్యాల, అక్టోబర్ 30:
చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా... భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా... విజయానికి ప్రతీకగా ప్రజలందరూ సమైక్యంగా ఈనెల 31న గురువారం జరుపుకునే దీపావళి పండుగ జిల్లాలోని ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ... రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు బుధవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు కూడ ప్రజలందరూ దీపావళి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.మతాబులు, చిచ్చుబుడ్లు, కాకరవత్తుల వెలుగులతో జిల్లాలో ప్రతి ఇంట శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు. భారతీయ పురాణాల ప్రకారం లోకకంటకుడైన నరకాసురుడనే రాక్షసుని సంహరించిన ఆనందంలో... దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా చెడును త్యజించి మంచిని పెంచాలనే ఉద్దేశంతో ఇంటింటా దివ్య వెలుగుల దీపాలను వెలిగిస్తూ ఆనందోత్సాహాల మధ్య ప్రజలందరూ ఈ దీపావళి పండుగ జరుపుకుంటారన్నారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలు, పెద్దలు అందరూ తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో దీపావళి పండుగను జరుపుకోవాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన పోలీస్ అధికారులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 30:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ఆర్మ్డ్ రిజర్వ్ డి.ఎస్.పి శ్రీనివాసులు గారి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణం నందు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా విధినిర్వహణలో మరణించిన పోలీసు అమరవీరులకి నివాళులు అర్పిస్తూ క్యాండిల్ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని పోలీస్ అధికారులు వారి సిబ్బంది క్యాండిల్స్ ను చేతపట్టుకొని శ్రీనివాస సెంటర్ నుండి గాంధీ చౌక్ వరకు ర్యాలీ ముందుకు సాగింది.ర్యాలీ ప్రారంభం నుండి గాంధీ చౌక్ చేరేంతవరకు భారత్ మాతాకి జై అంటూ నినాదాలతో మారుమ్రోగింది. అనంతరం ర్యాలీ గాంధీ చౌక్ చేరిన తర్వాత నంద్యాల జిల్లాలో అమరవీరులైన పోలీసులకు నివాళులు అర్పిస్తూ పోలీసు ఆమర వీరులకు జోహార్ అంటూ నినాదాలతో గాంధీచౌక్ మారుమొగింది. అనంతరం పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేందుకు నిరంతరం పోలీసులు శ్రమిస్తుఉంటారని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలియజేశారు.

# రైతులు విచక్షణారహితంగా పురుగుమందులు వాడరాదు

## -మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర రెడ్డి.




ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 30:
రైతులు విచక్షణారహితంగా పురుగుమందులు వాడరాదని మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలంలోని మహానంది చెంచులక్ష్మి గూడెం,మసీదుపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వరి పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వరి పంటలో సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పిచికారి చేస్తే, సుడిదోమ ఉధృతి ఎక్కువ అవుతుందన్నారు.నత్రజని ఎరువులు వాడటం వలన కూడా సుడిదోమ తీవ్రత పెరుగుతుందని తెలిపారు,పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్లు హెక్సాకోనజోల్ లేదా రెండు మిల్లీలీటర్లు వాలిడా మైసిన్ లేదా ఒక మిల్లి లీటర్ ప్రోపికోనజోల్ లేదా ఒక మిల్లి లీటర్ అజాక్సిస్ట్రోబిన్ తెగులు మందును పిచికారి చేయాలని రైతులకు తెలిపారు.వరి పంటలో ఆకు ముడత ఉధృతి ఎక్కువగా ఉందని, దీని నివారణకు ఇండక్సా కార్బ్ మందును ఒక మిల్లి లీటరు ఒక లీటర్ నీటికి లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా క్లోరాంత్రినిలిప్రోలు 0.3 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ ఫోర్ జి గుళికలు ఎకరాకు 8 కిలోలు చేసుకోవాలన్నారు. అగ్గి తెగులు నివారణకు గట్ల మీద కలుపును పూర్తిగా తీసివేయాలని, ముందు జాగ్రత్తగా సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్ అనే జీవ శిలీంద్ర నాశినిని పిచికారి చేసుకోవాలి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ శ్రీనివాసరెడ్డి, వీఆర్వో నరసింహులు, గ్రామ వ్యవసాయ సహాయకులు వసుంధర, విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కర్నూల్ డి ఈ ఓ సామెల్ పాల్ కు శుభాకాంక్షలు తెలిపిన బిటిఎఫ్.




ఆంధ్ర ప్రగతి కర్నూలు అక్టోబర్ 30:
కర్నూలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేయుచున్న శామ్యూల్ పాల్ ని జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించడం జరిగిన సంగతి విదితమే. ఈ సందర్భంగా డిఇఓ శామిల్ పాల్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తెలిపారు.కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞాపన చేయగా, స్పందించిన డిఇఓ నిబంధనలకు లోబడిన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిటీఎఫ్ నాయకులు రవికుమార్, జయపాల్, జగదీష్, మౌళిభాష మరియు జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి మునెయ్య పాల్గొన్నారు.

# హుండీ ఆదాయం రూ.30,23 లక్షలు..!

## -ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి.





ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 30: మహానంది దేవస్థానంలో కానుకల హుండీ లెక్కింపు ద్వారా రూ.30,23,514 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఈవో మాట్లాడుతూ.. ప్రధాన ఆలయాల్లో భక్తులు 50 రోజులపాటు సమర్పించిన, హుండీ కానుకలను ఆలయ ప్రాంగణంలోని, అభిషేక మండపంలో సిబ్బందితో లెక్కించామన్నారు. స్వామి, అమ్మవారి ఆలయాలలోని హుండీలతోపాటు ఉభయ దేవాలయాల ఉండి లెక్కింపునిర్వహించగా మహానంది దేవస్థానానికి రూ.30,23,514 లక్షలు వచ్చిందన్నారు.ఆలయాల ద్వారా రూ.29,28,740 వేలు అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ.78,712 వేలు గోసంరక్షణ ద్వారా రూ.16,062 వేలు,వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖా నంద్యాల డివిజన్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ సి.సురేఖ, మహానంది దేవస్థానం ఏఈఓ మధు,టెంపుల్ ఇన్స్పెక్టర్లు, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఏజెన్సీ వర్కర్స్, భ్రమరాంబిక, తిరుమల బాలాజీ, బాలాజీ సేవా సమితి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ అక్టోబర్ 30:
నంద్యాల మండలం పులిమద్ది మరియు భీమవరం గ్రామాల లో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు ఆధ్వర్యములో పొలంపిలుస్తోంది కార్యక్రమము నిర్వహించడం జరిగింది. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం అమలు పరుస్తున్న పథకాలు గురించి వివరించడం జరిగింది. అలాగే ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు మరియు సస్యరక్షణ చర్యల గురించి వివరించడం జరిగింది.ప్రస్తుతం వరి పంట గింజ కట్టే దశలో ఉన్నదని ప్రస్తుత వాతావరణ పరిస్థితుల లో వరి పంటను అగ్గితెగులు మరియు మాని పండు తెగులు ఆశించే అవకాశం ఉన్నదని వీటి నివారణకు ట్రిసైక్లోజోల్ 0.6 గ్రా ఒక లీటరు నీటికి మరియు కార్బండిజం 1 గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, అలాగే పొగాగు పంటలో ఆకుమచ్చ తెగులు నివారణకు థాయో ఫినేట్ మిథైల్ 1.5 గ్రా లీటరు నీటికి , అలాగే లద్దె పురుగు నివారణకు ఇమామెక్టిన్ న బెంజోయేట్ 0.5




గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించడం జరిగింది.పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీలో సాగు అయిన జొన్న ,మినుము మరియు శెనగ పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు.జొన్న పంటలో కత్తెరపురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని అందుకు గాను ఎకరాకు 5-6 లింగాకర్శక బట్టలు ఏర్పాటు చెయ్యాలని పొలంలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలని తెలియచేసారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో ఇమా మెక్టిన్ బెంజాయేట్ 0.5




గ్రా/ లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలని సూచించడం జరిగింది. అలాగే మినుము మరియు శెనగ పంటలలో విత్తనం వేసే ముందు ట్రైకో డెర్మా విరిడి 8 గ్రా /ఒక కేజీ విత్తనం కు విత్తనశుద్ధి చేస్కొని విత్తుకోవాలని తెలియచేసారు.
ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ మనిమోహన్ రెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది సురేష్ రెడ్డి ,కావ్య మరియు పులిమద్ధి మరియు భీమవరం గ్రామ రైతు సోదరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ వైద్యులు కొండయ్యకు నివాళులు అర్పించిన గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం.



ఆంధ్ర ప్రగతి కొలిమిగుండ్ల అక్టోబర్ 30:
ఇటీవల కొలిమిగుండ్ల మండలం బెలూము గ్రామంలో దారుణ హత్యకు గురైన ఆర్ఎంపీ వైద్యులు కొండయ్యకు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నివాళు లర్పించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.నంద్యాల పట్టణంలోని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం పట్టణ కార్యాలయంలో పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బెలుము కొండయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కొండయ్య అమర్ రహే అని నినాదాలు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి పర్ల, రాష్ట్ర నాయకులు నాగేశ్వరావు జిల్లా నాయకులు రమేష్ రావు మద్దిలేటి యాకూబ్ బాలుడు ఆళ్లగడ్డ వెంకటేశ్వర్లు బండి ఆత్మకూరు షరీఫ్ వెలుగోడు నాగశేషులు యాలూరు బైపురెడ్డి నయుం సుబ్బరాయుడు విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి దస్తగిరి మాట్లాడుతూ.. రాత్రనక పగలనక పల్లె అయినా పట్టణమైన ఊరైన కొండైన అహోరాత్రులు పేద ప్రజలు పల్లె ప్రజలే తమ తల్లిదండ్రులుగా భావించి ప్రాథమిక వైద్యం అందజేస్తున్న గ్రామీణ వైద్యులకు ఇలా జరగడం చాలా బాధాకరమైన విషయమని ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు

# బాల అకాడమీ పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాలు

ఆంధ్ర ప్రగతి
నంద్యాల టౌన్ అక్టోబర్ 30:
నంద్యాల పట్టణంలోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో అక్టోబర్ 30వ తేదీన అనగా బుధవారం రోజున ముందస్తు దీపావళి కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది.ముందుగా లక్ష్మీ పూజ చేసి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ నరకాసురుని వధించి నరులందరి జీవితాలలో వెలుగును నింపిన



మాత సత్య శౌర్యానికి చెడుపై మంచి విజయానికి ప్రతీక దీపావళి అని సీతారాములు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భం అని అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి మనందరి జీవితాలలో వెలుగులు నింపేది దీపావళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు అష్టలక్ష్ములుగా సంప్రదాయమైన వేషాలంకరణలతో అందరినీ అబ్బురపరిచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

